క్లుప్తంగా

వైభవంగా దుర్గాదేవి ఊరేగింపు



సత్యవేడులో దుర్గాదేవి నగరోత్సవం

సత్యవేడు: శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపులో భాగంగా సోమవారం దుర్గాదేవి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై కొలువుదీర్చి ఊరేగించారు. గాంధీరోడ్డు, నేతాజీ రోడ్డు, గంగమిట్ట వీధులలో నగరోత్సవం నిర్వహించారు. ఇంటింటా కర్పూర నీరాజనాలు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టారు. భక్తులకు పూజారులు కుంకుమ, విభూది అందజేశారు. అంతకు ముందు దుర్గాదేవికి 108 కలశాలతో కలశపూజ, హోమం నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీడీపీఓ దేవకుమారి

బుచ్చినాయుడుకండ్రిగ: తుపాను నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ దేవకుమారి ఆదేశించారు. సోమవారం ఆమె స్థానిక అరుంధతివాడలో మరమ్మతులకు గురైన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి కార్యకర్త కృష్ణవేణిని పైవిధంగా హెచ్చరించారు. దెబ్బతిన్న అంగన్‌వాడీ కేంద్రాలు తుపాను ప్రభావం మూలాన పడిపోయే ప్రమాదం ఉందని, ప్రస్తుతానికి కార్యకర్తలు ప్రభుత్వ భవనాలుంటే వాడుకోవాలని, లేని పక్షంలో ఇళ్ల వద్దనే కేంద్రాలను నిర్వహించాలన్నారు. పిల్లలు, బాలింతలు, గర్భవతులకు వర్షం వలన ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప, ఉపసర్పంచ్ మునిరాజా, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా మృత్యుంజయ స్వామికి అభిషేకం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విబూదితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కందాడులో ఉచిత కంటి వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేష్

ఏర్పేడు: మండలంలోని కందాడులో బెరకా ప్రార్థనా మందిరం పాస్టర్ సగేయూ, తిరుపతి అమెరికన్ లేయర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కందాడు, ఎస్సీ కాలనీ, శివగిరి ఎస్టీ కాలనీ, మడిబాక, సదాశివపురం, రాజులకండ్రిగ, ముసలిపేడు, బత్తెనయ్య కాలనీ, సరస్వతి కండ్రిగ తదితర గ్రామాల నుంచి వచ్చిన 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 12 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరికి బుధవారం తిరుపతిలోని అమెరికన్ లేజర్ కంటి ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయనున్నట్లు డాక్టర్ రాజేష్ తెలిపారు.

అన్నా క్యాంటీన్‌లోకి వర్షపునీరు



అన్న క్యాంటీన్ వద్ద నిల్వ చేరిన వర్షపునీరు

శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో ఉన్న అన్నా క్యాంటీన్ చిన్నపాటి వర్షానికే వరదనీరు లోపలకు వచ్చే పరిస్థితి ఏర్పడింది. గతంలో వర్షపు నీరు వెళ్లడానికి క్యాంటీన్ చివరి వరకు కాలువ ఉండేది. ఆ కాలువకు ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న కాలువ వరకు పైపు ఉండేది. అన్నా క్యాంటీన్ మరమ్మతుల్లో భాగంగా ఆ కాలువను పూడ్చి గట్టు వేశారు. దీంతో ఆ రోడ్డుకు చేరిన వర్షపునీరు అన్న క్యాంటీన్ వద్ద చేరుకుంది. చిన్నపాటి వర్షానికే ఇలా ఉంటే నాలుగురోజుల పాటు వర్షం కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వెంటనే కాలువను తీసి నీరు నిల్వ చేరకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముక్కంటి క్షేత్రం.. వ్యర్థాలమయం

శ్రీకాళహస్తి: రాబోయే నాలుగు రోజుల్లో తుపాను హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో మురుగునీటి కాలువలు చెత్తా చెదారం మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయే ఈ విధంగా దర్శనమిస్తున్నారు. కైలాసగిరి పర్వతాలు, లోబావి ప్రాంతంలో పడే వర్షపు నీరు గొడ్డేరు కాలువ నుంచి స్వర్ణముఖి నదిలో కలుస్తుంది. అయితే ఈ కాలువలో చెత్తా, చెదారం, వ్యర్థాలతో నిండిపోయింది. వర్షం పడితే నీరు పోయే అవకాశం లేక కల్వర్టు వద్ద నిలిచిపోయే ప్రమాదం ఉంది. దీని వల్ల సన్నిధివీధి, గొడ్డేరు తదితర ప్రాంతాల్లో వరద నీటితో మునిగే ప్రమాదం ఉంది. స్వర్ణముఖి నది పక్కన ఏర్పాటు చేసిన చెంబేడు కాలువ పూర్తిగా వ్యర్థాలు ప్లాస్టిక్‌తో నిండిపోయింది. దీంతో స్వర్ణముఖి నది నిండితే ఆ నీరు కాలువలో కల్వర్టుకు అడ్డుపడి గజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయే ప్రమాదం ఉంది. రాబోయే వర్షాకాలం చాలా ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ఇదిలా ఉంచితే కన్నలి కాలువలో కలిసేందుకు కొత్తపేట చర్చి వద్ద నుంచి ప్రవహిస్తున్న కాలువ సాంబయ్యపాళెం నుంచి కన్నలి కాలువకు వెళ్లే ప్రాంతంలో పూర్తిగా వ్యర్థాలు ప్లాస్టిక్‌తో నిండిపోవడంతో నీరు కదిలే పరిస్థితి లేదు. ముఖ్యంగా ఈ మూడు కాలువల ద్వారానే నీరు బయటకు వెళుతుంది. మూడు నెలలుగా స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి రూ.50 లక్షలు ఖర్చు పెట్టి అన్ని కాలువల్లో శుభ్రం చేశామని నీరుగా బయటకు వెళ్లిపోతుందని, పట్టణంలో ఏ విధమైన వరదలకు అవకాశం లేదని గొప్పలు చెప్పుకుంటున్నారు. అయితే ఆ కాలువల్లో గుట్టలు గుట్టలుగా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి ఉంటే వరదలు రాకుండా ఎలా ఉంటాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



బూడిదమిట్ట వద్ద గొడ్డేరు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

గత ఏడాది గొడ్డేరు నిలిచిపోవడంతో ఆలయం వద్ద నీరు నిలిచిన సందర్భాలు ఉన్నాయి. అలాగే గజేంద్రనగర్, ఈదులగుంట తదితర ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మళ్లీ ఈ వ్యర్థాలు తొలగించకుంటే పాత సంఘటనలు పునరావృతం అయ్యే పరిస్థితి ఉందని ప్రజలు అనుకుంటున్నారు.



చెంబేడు కాలువ బసవయ్యపాళెం మీదుగా వెళ్లే కన్నలి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు



వ్యర్థాలతో నిండిపోయిన కాలువ

స్థానికులకు దర్శనంపై వివాదాస్పద నిర్ణయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్థానికులకు దర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారన్న చర్చ మొదలైంది. భక్తులు ఆధార్‌కార్డు చూపించి పీఆర్వో కార్యాలయంలో స్లిప్ తీసుకుంటేనే ఆలయంలోకి కంచుగడప నుంచి సాధారణ క్యూలో అనుమతి ఇస్తామని ఈవో ఆజాద్ నిర్ణయం తీసుకున్నారు. దీన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శ్రీకాళహస్తీశ్వరాలయం పట్టణం నడిబొడ్డున ఉన్న ఆలయం. తిరుమల, శ్రీశైలం, విజయవాడ, అన్నవరం వంటి ఆలయాల మాదిరిగా కొండపై లేపోవడంతో ఈ ఆలయానికి స్థానికులు నిత్యం దర్శనం చేసుకుంటుంటారు. అంతే కాకుండా ఆలయానికి ధూపదీప నైవేద్యాలు లేని సమయంలో స్థానిక ప్రజలే చందాలు వేసుకుని దీపాలు వెలిగించిన రోజులు ఉన్నాయి. అయితే నేడు రాహుకేతు పూజలతో ఆలయం ఆర్థికంగా అభివృద్ధి చెందింది. స్థానిక భక్తులకు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి ఏకాంతసేవ వరకు గతంలో అనుమతి ఉండేది. అయితే ఇపుడు ఆలయాధికారులు పీఆర్వో కార్యాలయం వద్ద ఆధార్ కార్డుతో స్లిప్పు ఉంటేనే దర్శనం ఉంటుందని అంటున్నారు. ఉదయం పీఆర్వో కార్యాలయం నుంచి అక్కడి నుంచి స్లిప్పు తీసుకుని వచ్చే సమయానికి గడువు అయిపోతుందని స్థానిక భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో లాగానే సమయం కేటాయించాలని, ఖాళీగా ఉన్న సమయంలో క్యూలో కాకుండా నేరుగా వెళ్లేందుకు అవకాశం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

పాడి రైతులకు అమూల్ బోనస్ రూ.2.86 కోట్లు

- జనవరి నుంచి పాల సేకరణకు సిద్ధం

నారాయణవనం: జగనన్న పాలవెల్లువ పథకంలో సరఫరా చేసిన పాలు లీటరుకు 50 పైసలు చొప్పున బోనస్‌ను రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసినట్లు అమూల్ ఫీల్డ్ సూపర్‌వైజర్ రాహుల్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం జగనన్న పాల వెల్లువ పథకాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నారాయణవనం, వడమాలపేట, పుత్తూరు, చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాళ్యం మండలాల్లో అమలు చేసిందన్నారు. పాడి రైతుల నుంచి పాలను అమూల్ కంపెనీ సేకరించి ఇతర డెయిరీల కంటే అధిక ధరను చెల్లించిందన్నారు. 2023 అక్టోబర్ నుంచి 2024 సెప్టెంబర్ వరకు సేకరించిన పాలకు సంబంధించి లీటర్‌కు లాయల్టీ బోనస్‌గా 50 పైసలను అమూల్ అందజేసిందన్నారు. రాష్ట్రంలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, కడప జిల్లాలలో 18,645 మంది పాడి రైతులకు అమూల్ రూ 2.86 కోట్లను బోనస్‌ను దసరా కానుకగా రైతుల ఖాతాలో జమ చేశామని అన్నారు. తిరుపతి జిల్లాలో నారాయణవనం, వడమాలపేట, పుత్తూరు మండలాలకు చెందిన 2,285 మంది రైతులకు రూ 20.36 లక్షలను బోనస్‌గా అందుకున్నారని ఆయన తెలియజేశారు. జనవరి నుంచి పాలను సేకరించేందుకు అమూల్ కంపెనీ సిద్ధమవుతోందని వెల్లడించారు.

ఈ కంటైనర్‌ను తొలగించండి

ఏర్పేడు: ఆరులేన్ల రోడ్డు పనుల్లో భాగంగా మండలంలోని ఇసుకతాగేలి ఒరవ కాలువకు అడ్డంగా ఏర్పాటు చేసిన కంటైనర్‌ను తొలగించాలని సోమవారం గ్రామస్తులు, రైతులు రోడ్డు పనుల అధికారులకు ఫిర్యాదు చేశారు. రేణిగుంట మండలంలోని మల్లిమడుగు రిజర్వాయర్ నుంచి ఇసుకతాగేలి చెరువుకు సాగునీటిని అందించడానికి ఒరవ కాల్వ ఉంది. ఆరులేన్ల రోడ్డు పనులు, గ్యాస్ పైప్‌లైన్ అధికారులు ఒరవకాల్వకు అడ్డంగా కంటైనర్‌ను పెట్టడంతో మల్లిమడుగు రిజర్వాయర్ నుంచి వచ్చే సాగునీరు చెరువుకు చేరడం లేదు. అయితే ప్రస్తుతం వర్షాలు కురుస్తుందున ఒరవ కాల్వకు నీరు రాకుండాపోతోంది. ఈ చెరువు నిండకుంటే రబీలో వరిసాగు కష్టతరమవుతందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఉన్నతాధికారులు విచారణ చేసి కాల్వకు అడ్డంగా ఉన్న కంటైనర్‌ను తొలగించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.



ఒరవ కాల్వకు అడ్డంగా ఏర్పాటు చేసిన కంటైనర్

వాయుగుండం.. అధికారగణం అప్రమత్తం

సూళ్లూరుపేట: తూర్పు ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి తీర ప్రాంత గ్రామాల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. దీంతో సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి యాదవ్ ఆధ్వర్యంలో అధికారులందరినీ అప్రమత్తం చేశారు. మంగళ, బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉండడంతో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. తుపాన్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రాలను కూడా సిద్ధంగా ఉంచారు. సోమవారం పాఠశాలలు, అంగన్‌వాడీలకు సెలవు ప్రకటించి, పిల్లలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నారు.

19న జాబ్‌మేళా

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈ నెల 19వ తేదీ శనివారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా కార్యాలయం, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎం.శ్రీలత తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పలు బహుళ జాతీయ కంపెనీలు ఈ ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. అభ్యర్థులు ఉదయం 9గంటలకు ఆధార్‌కార్డు, విద్యార్హత ధృవపత్రాలు జిరాక్స్, బయోడేటాతో రావాలని చెప్పారు. మేళాకు హాజరయ్యే వారు సంబంధిత వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 79895 09540ను సంప్రదించాలని కోరారు.

బీఎన్ కండ్రిగలో భారీ వర్షం



బుచ్చినాయుడుకండ్రిగలో కురుస్తున్న వర్షం

బుచ్చినాయుడుకండ్రిగ: తుపాను ప్రభావం మూలాన మండలంలో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు పొలాలను దుక్కులు దున్ని వరి సాగుకు సన్నద్ధులవుతున్నారు. మండల పరిధిలోని చిన్న చిన్న వాగులు, వంకలు, కుంటలు, చెరువులు పొంగి ప్రవహించాయి.

ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడండి

- జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగ/సత్యవేడు: భారీ వర్షాలకు ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ అధికారులను ఆదేశించారు. తుపాను రక్షణ చర్యలపై సోమవారం బుచ్చినాయుడుకండ్రిగ, సత్యవేడులో ఆయన అధికారులతో సమీక్షించారు. మేజర్, మైనర్ చెరువుల పటిష్టతపై ఆరా తీశారు. రానున్న మూడు రోజులపాటు తుపాను ప్రభావం వలన అతి భారీ వర్షాలు పడుతాయని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఇరిగేషన్ అధికారులు వారి పరిధిలోని చెరువులు దెబ్బతినకుండా చూడాలన్నారు. చెరువు కట్టలకు ప్రమాదం అనిపిస్తే వెంటనే తహసీల్దార్లు, ఎంపీడీఓలకు సమాచారం చేరవేయాలన్నారు. అలాగే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పర్యటించి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వారికి అవసరమైన ఆహారం ,నీటి వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని తహసీలార్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. వర్షాలకు కూలే పూరిండ్లు, గుడిసెలు గుర్తించి ఆ ఇళ్లలో ఉన్న వారిని సమీప పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లకు తరలించాలన్నారు. నిండు గర్భిణులను గుర్తించి ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పీహెస్‌సీ సెంటర్లు, కమ్యూనిటీ వైద్యశాలలకు తరలించాలన్నారు అలాగే పిల్లలను నీటి గుంతలు వద్దకు పంపకుండా వారి తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలన్నారు. దండోరా ద్వారా ప్రమాద హెచ్చరికలు ప్రజలకు తెలియజేయాలన్నారు. సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలో హెల్ప్ లైన్ నంబర్ కంట్రోల్ రూం : 9391516885కు ఎప్పటికప్పుడు కార్యదర్శులు, వీఆర్‌ఓలు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సమీక్షలో పశుసంవర్థకశాఖ ఏడీఏ మునిరాజా, తహసీల్దార్లు సుబ్రమణ్యం, టీవీ సుబ్రమణ్యం, ఎంపీడీఓలు త్రివిక్రమ్ రావు, చంద్రశేఖర్, ఎస్‌ఐలు విశ్వనాథనాయుడు, రామస్వామి, ఎంఈఓలు మునిసుబ్రమణ్యం, రవి, ఉషా, పంచాయతీరాజ్ ఏఈ ఇబ్రహీం ఖాన్, సత్యవేడు మేజర్ పంచాయతీ సెక్రటరీ ముని రవి కుమార్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

సాగు భూములకు పట్టాలివ్వండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కుక్కంబాకం గ్రామ దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సోమవారం తహసీల్దార్ సుబ్రమణ్యంకు సీపీఐ జిల్లా నాయకుడు కత్తిధర్మయ్య, దళితులు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని కుక్కంబాకం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 81లో 20 ఎకరాల భూమిని 20 ఏళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు దళారీలతో కుమ్మక్కై దళితులకు భూ పట్టాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఎన్నోసార్లు కోరినా పట్టించుకున్న పాపాన పోలేదని, ఇప్పటికైనా పట్టాలు ఇవ్వాలని, లేనిపక్షంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు, దళితులు

దొంగను పట్టుకున్న గ్రామస్తులు



పట్టుబడిన నిందితుడు చిరంజీవి

ఏర్పేడు: దొంగతనానికి వెళ్లిన దొంగను గ్రామస్తులు పట్టుకున్న సంఘటన మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, ఇద్దరు యువకులు ఆదివారం అర్ధరాత్రి స్కూటీపై ఎస్సీ కాలనీలో చొరబడి, ఇంటి తలుపును పగులకొడుతుండగా, స్థానికులు నిద్రలేశారు. దీంతో వారు అక్కడ నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించారు. గ్రామస్తులు వెంబడించి, ఒకరిని పట్టుకున్నారు. మరో దొంగ పరారయ్యాడు. పట్టుకున్న దొంగను ఓ స్తంభానికి తాడుతో కట్టి విచారించగా తిరుపతి తాతయ్యగుంటకు చెందిన చిరంజీవి(21)గా తేలింది. స్కూటీ డిక్కీలో ఓ గుడ్డచుట్టిన పెద్ద కత్తి, ఇనుప డమ్మీ తదితర మారణాయుధాలను గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా, వారు వచ్చి నిందితుడిని స్కూటీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మృతదేహం వెలికితీత

నాగలాపురం: మండలంలోని కారణి గ్రామం వద్ద అరుణా నదిలో ఆదివారం సాయంత్రం వడివేలు(35) అనే వ్యక్తి గల్లంతైన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం ఎస్ఐ సునీల్ కుమార్ తన సిబ్బందితో కలిసి గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు వడివేలు మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



వడివేలు మృతదేహం వద్ద పోలీసులు

నిండుగా చెరువులు.. పచ్చగా పొలాలు

కండలేరు జలాశయం నుంచి సెప్టెంబర్ నెలలో చెన్నై ప్రజలకు దాహార్తి తీర్చడానికి సాయి గంగ కాలువ ద్వారా నీటిని సరఫరా చేయడంతో కాలువలో గంగనీళ్లు పరవళ్లు తొక్కుతోంది. సత్యవేడు మండల ప్రాంతంలోని కాళమనాయుడుపేట, నరసరాజు అగ్రహారం, కొత్తమారికుప్పం పంచాయతీలోని చెరువులకు ఊట నీరు చేరి జలకళ సంతరించుకుంది. రైతులు పంటల సాగుకు సమాయత్తమయ్యారు.

- గంగ ఊట నీటితో పారుతున్న కలుజులు
- పచ్చదనం పరచుకున్న ఆయకట్టు
- వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం



కలుజు పారుతున్న నరసరాజు అగ్రహారం చెరువు

సత్యవేడు: గంగ కాలువలో నీరు ప్రవహిస్తుండడంతో పల్లపు ప్రాంతాల్లోని చెరువులకు ఊట నీరు చేరి కలుజులు పారుతున్నాయి. కొన్ని రోజులుగా నరసరాజు అగ్రహారం, కొత్తమారికుప్పం , కాళమనాయుడుపేట చెరువులు జలకళతో తొణికిసలాడుతున్నాయి. వరి పంటకు సరిపడే నీరు చెరువులకు చేరడంతో ఈ గ్రామాల రైతులు వరి సాగుకు సమాయత్తం అయ్యారు. కొందరు రైతులు వరినార్లు పోస్తున్నారు. మరి కొందరు దుక్కులు దున్ని వరి విత్తనాలు చల్లుతున్నారు. మూడు చెరువుల పరిధిలో సుమారు 300 ఎకరాలకు పైగా వరి నాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధులయ్యారు.

కలుజులు పారుతున్న చెరువులు

మూడు చెరువులు కలుజులు పారుతుండడంతో సమీపంలోని తమిళనాడులోని మాదరపాకం, మానెల్లూరు చెరువులకు నీరు చేరడంతో అక్కడా వరి సాగు చేస్తున్నారు. అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండకపోయినా, గంగ కాలువ ఊటనీరు జోరుగా పారుతుండడంతో చెరువులు పుష్కలంగా నీటితో కనిపిస్తున్నాయి.

పంటల సాగులో రైతులు బిజీ బిజీ

కాళమనాయుడుపేటలో వరి సాగు పనుల్లో రైతులు బిజీబిజీగా ఉంటున్నారు. ఇప్పటికే వరి నార్లు వదిలిన రైతులు దుక్కులు దున్ని పొలాలు అడుసు చేస్తున్నారు. వారం రోజులుగా రైతులు నారు మడుల్లో వరినారు పీకి పొలాల్లో నాట్లు వేస్తున్నారు. రైతులు, కూలీలకు నెల రోజులుగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.



పొలాల్లో వరినాట్లు వేస్తున్న మహిళలు



ట్రాక్టరుతో పొలం దున్నుతున్న రైతులు

ఎన్టీ రామారావు మా పాలిట దేవుడు



తెలుగుగంగ కాలువ తవ్వించిన దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మా పాలిట దేవుడు. తెలుగు గంగలో నీటి ప్రవాహం సాగితేనే మా ఊరి చెరువుకు ఊటనీరు చేరుతుంది. కొన్ని రోజులకు చెరువు నిండి కలుజు పారుతుంది. కలుజు పారితే పంటకు సరిపడే నీరు వచ్చినట్లే.

–టి.సుబ్రమణ్యం, నరసరాజు అగ్రహారం

చెరువు నిండితే పంట పండినట్లే



చెరువు నిండా నీరుంటే పంట సాగు చేస్తాం. నేను రెండెకరాలు వరి సాగు చేస్తాను. పంట కోతకు వచ్చే వరకు చెరువు నీరు సరిపోతుంది. ప్రతి ఏడాది గంగ కాలువలో నీరు వదిలితే మా చెరువు నిండుతుంది. మేం పైర్లు సాగు చేస్తూ పంట దిగుబడులు ఇంటికి తీసుకుపోతున్నాం.

–ఏ.వాసు, ఎన్ఆర్ అగ్రహారం

గంగ ఊటనీరే సాగుకు ఆధారం



తెలుగు గంగలో నీరు ఎన్ని రోజుల కాలువలో పారుతుందో అన్ని రోజులూ నీరు చెరువుకు చేరుతుంది. దీంతో చెరువు నిండుగా ఉంటోంది. ఈ నీటిపై ఆధారపడి వరి పంట సాగు చేస్తున్నాం. వర్షం సకాలంలో పడక పోయినా, గంగ కాలువ ఊట నీరే సాగుకు ఆధారంగా ఉంటోంది.

శ్యాంప్రసాద్ రెడ్డి, కొత్త మారికుప్పం